క్లుప్తంగా

3 నుంచి దసరా ఉత్సవాలు

కోవెలకుంట్ల: పట్టణంలోని అంకాలమ్మ చౌరస్తాలో వెలసిన మారెమ్మఆలయంలో వచ్చే నెల 3వ తేదీ నుంచి దసరా మహోత్సవాలు ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పది రోజుల పాటు ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. మొదటి రోజు అమ్మవారు బాలాత్రిపుర సుందరిదేవి అలంకారం, 4న గాయత్రీదేవి, 5న అన్నపూర్ణాదేవి, 6న లలిత త్రిపుర సుందరిదేవి, 7న మహాచండీదేవి, 8న మహాలక్ష్మిదేవి,9న సరస్వతీదేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసురమర్ధిని, 12న రాజరాజేశ్వరిదేవి అలంకారాల్లో భక్తులకు భక్తులకు దర్శనమిస్తారన్నారు.అదే రోజున విజయదశమి, అమ్మవారి గ్రామోత్సంనిర్వహిస్తామని పేర్కొన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు రాత్రి కుంకుమార్చన జరుగుతుంద ని తెలిపారు. 10వ తేదీ మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి పూట తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఆ శాఖ ఏఈ రామమోహన్ చెప్పారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, జోళదరాశి, రేవనూరు, కలుగొట్ల, కోవెలకుంట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామలలో విద్యుత్ వేళలు

సంజామల: మండలంలోని సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఈ వారం వ్యవసాయానికి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె గ్రామాల్లో పగటి పూట 9 గంటల విద్యుత్ ఉంటుందని వెల్లడించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ, ఎస్‌ఐ

ప్యాపిలి: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్‌ఐ మధుసూదన్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాత నేరస్తులు,రౌడీషీటర్లపై నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందని తెలిపారు. గొడవల జోలికి వెళ్లకుండా కుటుంబంతో ప్రశాంత జీవితం గడపాలని హితవుపలికారు. అనవసర విషయాల్లో తలదూర్చి ఇబ్బందులు తెచ్చుకోవద్దని సూచించారు. ప్రవర్తన మార్చుకోకపోతే మరింత కఠినంగా వ్యవహిస్తామని హెచ్చరించారు.

భగవద్గీత పఠనంతో మానసిక ప్రశాంతత



భగవద్గీత పోటీలో విద్యార్థిని

బేతంచెర్ల: భగవద్గీత పఠనంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆర్యవైశ్య సంఘం పట్టణ, మండల అధ్యక్షులు గుండా గోపాలు, కందగడ్డల జనార్దన్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పూదోట ఆశ్రమంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు భగవద్గీత పోటీలను నిర్వహించారు. ఈపోటీలకు కర్నూలుకు చెందిన ఇస్కాన్ సంస్థలో సేవ చేస్తున్న నిత్యతృప్త దాస్, తల్లం వెంకటేశ్వర్లు న్యాయ నిర్ణేతలుగా వ్యహరించారు. విద్యార్థులు భగవద్గీత శ్లోకాలను చక్కాగా వినిపించారు.

భక్తిశ్రద్ధలతో లలితా సహస్రనామ పారాయణం



కొలువుంచిన అమ్మవారి ప్రతిమలు

బేతంచెర్ల: పట్టణంలోని పూదోట ఆశ్రమంలో లోక కళ్యాణార్థం సప్తాహ సామూహిక లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. ఈనెల 22వ తేదీ ప్రారంభమైన పూజా కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయి. ఆయా కాలనీల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లలితా సహస్రనామ పారాయణం చేశారు. హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అమ్మవారి స్తోత్రాలతో పాటు భక్తి గీతాలను ఆలపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు గుండా గోపాలు, ఈశ్వర్ ప్రసాద్, దామోదరయ్య, లక్ష్మీనారాయణ, నాగ మోహన్, విశ్వనాథ్ రెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

ఏరు దాటని ప్రయాణం

- కోవెలకుంట్లలో వాగు కష్టాలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- వాగు దాటేందుకు అవస్థలు పడుతున్న రైతులు





అమడాల సమీపంలో జుర్రేరు వాగుపై నిర్మించిన కల్వర్టు, కోవెలకుంట్ల జుర్రేరువాగుపై వంతెన లేకపోవడంతో రహదారిపై ప్రవహిస్తున్న నీరు

కోవెలకుంట్ల: బనగానపల్లె- కోవెలకుంట్ల మండలాల మధ్య ప్రవహిస్తున్న జుర్రేరువాగుపై వంతెనలు లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు వాగులు దాటేందుకు ఏళ్ల తరబడి అవస్థలు పడుతున్నారు. ఈ వాగు కోవెలకుంట్ల మండలంలోని అమడాల, కోవెలకుంట్ల సమీపంలో ప్రవహిస్తూ కుందూనదిలో కలుస్తుంది. అమడాల- బిజనవేముల మధ్య వాగుపై కల్వర్టు లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. వర్షాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వాగు దాటేందుకు అష్ట కష్టాలు తప్పేవి కాదు. ఏడాదిన్నర క్రితం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అప్పటి బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులు వాగు కష్టాలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన కాటసాని వాగుపై కల్వర్టు నిర్మాణానికి రూ. 55 లక్షలు నిధులు మంజూరు చేయించారు. కల్వర్టుతో పాటు ఈ రహదారిలో 300 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణానికి మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ. 20 లక్షలు నిధులు కేటాయించారు. ఆ నిధులతో కల్వర్టు, సీసీరోడ్డు నిర్మించి రెండు గ్రామాల ప్రజలకు శాశ్వత వంతెన కష్టాలు తీర్చారు.

వెంటాడుతున్న వంతెన కష్టాలు

కోవెలకుంట్ల పట్టణ శివారులోని నూర్‌షావలి దర్గాకు వెళ్లే రహదారిలో ప్రవహిస్తున్న జుర్రేరు వాగుపై వంతెన లేకపోవడంతో రైతులు, దర్గాకు వెళ్లే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. వాగు ఆవతలివైపున పంట పొలాలు ఉండడంతో రైతులు ఎరువులు, పంట ఉత్పత్తులు, పశుగ్రాసం తరలించుకునేందుకు అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో వాగులో నీరు అధికంగా చేరితే రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. ఏటా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివాలయం, నూర్‌షావలి దర్గాలో మూడు రోజులపాటు వేడుకలు జరుగుతాయి. వేడుకలను తిలకించేందుకు వేలాది మంది భక్తులు జుర్రేరువాగు దాటుకుని వెళ్లాల్సి ఉంది. మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలు వాగు దాటేందుకు సాహసం చేయాల్సి వస్తోంది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని వాగుపై వంతెన ఏర్పాటు చేసి ప్రజల కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

బేతంచెర్ల: అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ సత్ప్రవర్తనతో మెలగాలని సీఐ డి.వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో బేతంచెర్ల మండలంలోని రౌడీషీటర్లు, అనుమానితులకు సీఐ కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రామాల్లో తగాదాలు, నేరాలకు పాల్పడితే ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. అందరితో మంచిగా ఉంటూ సంతోషంగా గడపాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

దేవిశరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు



వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి

బనగానపల్లె రూరల్: పట్టణంలోని కొండపేటలో ఉన్న శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో అక్టోబర్ 3వ తేదీ నుంచి 15వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆదివారం తెలిపారు. ఈ మేరకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. అక్టోబర్ 3న బాలా త్రిపుర సుందరీదేవి అలంకరణ, 4న శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి, 5న గాయత్రీదేవి, 6న మీనాక్షిదేవి, 7న అన్నపూర్ణేశ్వరిదేవి, 8న మంగళగౌరిదేవి, 9న శ్రీసరస్వతీదేవి, 10న మహిషాసురమర్ధిని, 11న విజయలక్ష్మీ, 12న రాజరాజేశ్వరిదేవి, 13న శ్రీవాసవీమాత రథోత్సవం, 14న వసంతోత్సవం, పాన్పుసేవ, తొట్లపూజ, 15న చల్లముద్ద కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయని వెల్లడించారు.

మంగపల్లెలో వైద్య శిబిరానికి విశేష స్పందన



సంజామల: భారీగా తరలివచ్చిన జనం,



బేతంచెర్ల: శిబిరాన్ని ప్రారంభిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

సంజామల: మండల పరిధిలోని మంగపల్లె గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పెద్దిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రజలకు గుండె, ఊపిరితిత్తులు, షుగర్, బీపీ, కంటి, చర్మ, కిడ్నీ తదితర సమస్యలకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి షేక్షావల్ రెడ్డి, పెద్దిరెడ్డి మౌలాల్ రెడ్డి పాల్గొన్నారు.

బేతంచెర్ల: వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల ఆవరణలో రోటరీ క్లబ్ సభ్యులు గుండె సంబంధ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వీరారెడ్డి, ప్రశాంత్ రెడ్డి ప్రారంభించారు. వైద్యులు క్రాంతి చైతన్య, జహంగీర్ బాషా, మురళీకృష్ణ, శ్రీనివాస్ నెర్ల 200 మందికి ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సత్తార్, ప్రేమ్ స్వరూప్, మాణిక్యం, వీరభద్రారెడ్డి, సుబ్బారెడ్డి, గుండా అశ్వర్థనారాయణ, రామేశ్వర్‌రెడ్డి, అక్తాబ్, మగ్బుల్ పాల్గొన్నారు.

లడ్డూ వివాదంతో గాడితప్పిన పాలన



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ప్యాపిలి: కూటమి ప్రభుత్వం తిరుమల లడ్డూ వివాదాన్ని ప్రతిపక్షంపైకి నెట్టే చర్యల్లో పరిపాలనను గాలికొదిలేసిందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాధాకృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సూర్యప్రతాప్ విమర్శించారు. ఆదివారం ప్యాపిలిలో సీపీఐ నాయకులు సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు ప్రభుత్వ పెద్దలందరూ తిరుమల లడ్డూ వివాదం చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మతాల మధ్య చిచ్చు పెడుతూ పరిపాలనను గాలికొదిలారని ఆరోపించారు. రాష్ట్రంలో పరిష్కారానికి నోచుకోని సమస్యలు ఎన్నో ఉన్నాయని.. కూటమి ప్రభుత్వం తక్షణమే సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. వర్షాలకు పంట దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని కోరారు. సీపీఐ పట్టణ కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్, నాయకులు జింకల పెద్దన్న, శ్రీనివాసులు, రాము, భాస్కర్, రవి పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు



సోదాలు చేస్తున్న పోలీసులు

కొలిమిగుండ్ల: ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని సీఐ రమేష్‌బాబు హెచ్చరించారు. ఆదివారం తెల్లవారుజామున చింతలాయిపల్లెలో సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పలువురు రాజకీయ పార్టీ నాయకులు, అనుమానితుల ఇళ్లలో సోదాలు చేశారు. పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమయ్యారు. సీఐ మాట్లాడుతూ.. గొడవలకు దూరంగా ఉంటూ ఎవరి పని వారు చేసుకోవాలన్నారు. అనవసరమైన విషయాలకు ఘర్షణలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఏవైనా సమస్యలు వస్తే స్టేషన్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. గ్రామంపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు.

డీజేలకు అనుమతి లేదు



దుర్గామాత ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సీఐ

బేతంచెర్ల: దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కొలువుదీరే దుర్గామాత విగ్రహాల ఊరేగింపులో డీజేలకు అనుమతి లేదని సీఐ డి.వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. ఆదివారం పట్టణంలో దుర్గామాత విగ్రహాలు నెలకొల్పే ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. అక్టోబర్ 3న విగ్రహాలు ఏర్పాటు మొదలుకుని 13వ తేదీ నిర్వహించే నిమజ్జనం వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవడానికి హిందూ సంఘాల నాయకులు సహకరించాలని కోరారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

రామశేషయ్య సేవలు మరవలేనివి



మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

బనగానపల్లె: అధ్యాత్మిక కార్యక్రమాల్లో గురూజీ రామశేషయ్య సేవలు మరవలేనివని బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ శివార్లలోని రవ్వలకొండ వద్ద హట్టి మునిస్వామి 44వ ఆరాధన మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. బీసీ రాజారెడ్డి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ.. 25 ఏళ్లుగా అధ్యాత్మిక ప్రవచనాలు బోధిస్తున్న రామశేషయ్యను మధుర ప్రవన కోకిల బిరుదుతో సత్కరించి రజత కంకణ ధారణ చేశారు. కార్యక్రమంలో బ్రహ్మంగారిమఠం అచలాశ్రమం విరాజనంద స్వామి, ఏపీఎస్ శర్మ, వైవీఎస్ నారాయణరెడ్డి, వెంకట రమణమూర్తి పాల్గొన్నారు.

సమస్యల వలయంలో ప్రభుత్వ బడి



బందార్లపల్లె ప్రాథమిక పాఠశాల



వృథాగా మారిన బోరు

కొలిమిగుండ్ల: విద్యార్థులున్న చోట ఉపాధ్యాయులు ఉండరు.. ఉపాధ్యాయులు ఉన్న చోట విద్యార్థులు ఉండరు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో ఈ పరిస్థితి నెలకొంది. మండల పరిధిలోని బందార్లపల్లె ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 73 మంది విద్యార్థులు ఉన్నారు. గతంలో నలుగురు ఉపాధ్యాయులు ఉండడంతో విద్యార్థులకు చక్కగా విద్యా బోధన జరుగుతుండేది. ఏడాది క్రితం ఇద్దరు ఉపాధ్యాయుల్లో ఒకరికి పదోన్నతి రాగా, మరొకరు బదిలీపై ఇతర పాఠశాల కు వెళ్లారు. ఖాళీ అయిన రెండు స్థానాలను విద్యా శాఖ ఉన్నతాధికారులు చూపించకపోవడంతో రెండు పోస్టులు రాకుండా పోయాయి. ఖాళీ చూపించి ఉంటే ఇతర ఉపాధ్యాయులు ఇక్కడికి వచ్చే అవకాశం ఉండేదని విద్యార్థులు తల్లితండ్రులు వాపోతున్నారు. ప్రస్తుతం ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు-నేడు కింద పాఠశాలలో పూర్తి స్థాయిలో వసతులు కల్పించింది. కొద్ది రోజుల క్రితం బోరు మరమ్మతులకు గురి కావడంతో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. తాత్కాలికంగా పబ్లిక్ కొళాయి కనెక్షన్ ఏర్పాటు చేసుకుని విద్యార్థుల టాయ్‌లెట్లకు నీటిని ఉపయోగించుకుంటున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు ఇళ్ల వద్ద నుంచే వాటర్ బాటిళ్లు వెంట తెచ్చుకోవాల్సి వస్తోంది. బోరుకు మరమ్మతులు చేపట్టి పాఠశాలకు నీటి సౌకర్యం కల్పించాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.

గోమాతకు పూజలు



గోమాతకు పూజలు చేస్తున్న నాయకులు

డోన్ టౌన్: ప్రతి హిందువు గోమాతను పూజించాలని కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తకాపు హేమసుందర్‌రెడ్డి బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సందు రమణ, పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్ అన్నారు. బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో గోపూజ చేశారు. గోమాతను పూజించడం, వాటిని సంరక్షించడం మన ధర్మం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆశోక్, నాగార్జున, రామయ్య, హరినాయుడు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

కొలిమిగుండ్ల: రక్తదానం ప్రాణదానంతో సమానమని సీఐ రమేష్‌బాబు అన్నారు. ఆదివారం స్థానిక ఉన్నత పాఠశాలలో హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రక్తదానంతో మరొకరి జీవితంలో వెలుగు నింపవచ్చని తెలిపారు. సకాలంలో రక్తం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. రక్తం ఇచ్చిన వారిని అభినందించి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం హుసేనయ్య, హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీరామ్, శివ, గురుప్రసాద్, శివారెడ్డి పాల్గొన్నారు.

మద్యం విక్రేతల అరెస్ట్

డోన్ రూరల్: మండల పరిధిలోని గోసానిపల్లి గ్రామంలో మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని ఆదివారం అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ రాకేష్ తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు గోసానిపల్లి సమీపంలోని సుంకులమ్మ ఆలయం వద్ద మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. డోన్ మండలం వెంకటనాయునిపల్లి గ్రామానికి చెందిన శీలం రాజశేఖర్, నక్కలవాగుపల్లి గ్రామానికి చెందిన షేక్ మౌలాలి, ధర్మవరం గ్రామానికి చెందిన వినీత్ కుమార్‌రెడ్డి గోవా నుంచి ఆటోల్లో మద్యం తీసుకొచ్చి గ్రామాల్లో అధిక ధరలకు అమ్ముతున్నట్లు గుర్తించామని తెలిపారు. శీలం రాజశేఖర్, షేక్ మౌలాలీలను అదుపులోకి తీసుకోగా వినీత్‌కుమార్‌రెడ్డి పారిపోయాడని తెలిపారు. వారి వద్ద నుంచి హేవార్డ్స్ 528 బాటిళ్లు, రాయల్‌స్టాగ్ 24 బాటిల్స్, మ్యాన్సన్ హౌస్ 18 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు. పరారీలో ఉన్న వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు.

డోన్‌కు వచ్చిన హైకోర్టు జడ్జి



జస్టిస్ మన్మథరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న న్యాయవాదులు

డోన్ టౌన్: ఏపీ హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్టు ఫోలియో జడ్జి డాక్టర్ జస్టిస్ మన్మథరావు ఆదివారం సాయంత్రం డోన్‌కు వచ్చారు. కర్నూలులో జరిగిన న్యాయాధికారుల సమీక్ష సమావేశానికి వచ్చిన ఆయన తిరిగి విజయవాడకు రైలులో వెళ్లేందుకు డోన్‌కు వచ్చారు. ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆయన్ను డోన్ బార్ కౌన్సిల్ న్యాయవాదులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. డోన్ కోర్టు నిర్వహణ, నూతన భవనాల స్థితిగతులపై ఆరా తీశారు. జిల్లా జడ్జి కబర్డి, డోన్ సీనియర్ సివిల్ జడ్జి తంగమణి, జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేడ్కర్, బార్ కౌన్సిల్ అధ్యక్షుడు వేణుగోపాల్‌గౌడ్, కార్యదర్శి లక్ష్మిశెట్టి కృష్ణ ప్రసాద్, సహాయ కార్యదర్శి నాగరాజుగౌడ్, కోశాధికారి మంగమూరి శ్రీనివాసులు, న్యాయవాదులు రాగుల రాముడు, నాగభూణంరెడ్డి, నరసింహులు, ధనుంజయరెడ్డి తదితరులు ఉన్నారు.

కొండెక్కిన టెంకాయ



డోన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. రానున్న పెత్తర్లమావాస్య, దసరా పర్వదినాలకు సామాన్య ప్రజలు దూరం కావాల్సి వస్తోంది. టెంకాయ ధరలు కూడా సామాన్యునికి అందుబాటులో లేకుండా పెరిగిపోతున్నాయి. మొన్నటి వరకు రూ.20 ఉన్న టెంకాయ ధర నేడు మార్కెట్‌లో రూ.30కి విక్రయిస్తున్నారు. వచ్చే వారం రూ.40కి పెరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కిలో కొబ్బరి కూడా రూ.100 నుంచి రూ.180కు చేరింది.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

రుద్రవరం: మండల పరిధిలోని రెడ్డిపల్లె మెట్ట వద్ద రెండు వాహనాలు ఢీకొనడంతో మంగలక్ష్మి, దుర్గాలక్ష్మి, వీరవేణి తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఒరిస్సాకు చెందిన భక్తులు టెంపో ట్రావెల్స్‌లో అహోబిలం లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకుని రుద్రవరం మీదుగా కోటప్పకు కొండకు వెళ్తున్నారు. రెడ్డిపల్లె సమీపంలోకి రాగానే పొలంలో నుంచి మిర్చీ లోడుతో రోడ్డెక్కుతున్న లారీ... టెంపో ట్రావెల్స్‌ను ఢీకొట్టింది. ఆ ప్రమాదంలో ముగ్గురు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే రుద్రవరంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేయించినట్లు గ్రామస్తులు తెలిపారు



బేతంచెర్ల రోడ్డులో ఏర్పడిన గుంత

ప్రమాదాల గుంత

డోన్: పట్టణంలోని నంద్యాల రైల్వేగేట్ వద్ద బేతంచెర్ల ప్రధాన రహదారిపై గుంత ఏర్పడింది. డోన్- గుత్తి వైపు నుంచి బేతంచెర్లకు నిత్యం వందలాది వాహనాలు ఈ రహదారిపై వెళుతుంటాయి. రాత్రి వేళల్లో గోతిని గమనించని వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. మున్సిపల్, ఆర్అండ్‌బీ అధికారులు చొరవ తీసుకుని ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.